ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు
TAMILNADU

శుక్రవారం 29 మార్చి 2024

● ప్రచార పర్వం



మక్కల్ నీది మయ్యం అధినేత కమల్‌ను గురువారం ఉదయం చెన్నైలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, శ్రీపెరుంబుదూర్ నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి టీఆర్ బాలు తదితరులు




చెన్నై కొళత్తూర్ ఎవర్విన్ స్కూలులో గురువారం ఓటు హక్కు ప్రాధాన్యం తెలిపేలా విద్యార్థులు గీసిన రంగవల్లిక



విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాధికకు మద్దతుగా ప్రచారం చేపట్టిన ఆమె భర్త, నటుడు శరత్‌కుమార్

4న కన్నియాకుమారిలో
అమిత్ షా ప్రచారం



అడయార్, మార్చి 28: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఏప్రిల్ 4వ తేదీన కన్నియాకుమారిలో పర్యటించనున్నారు. ఈస్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొన్ రాధాకృష్ణన్‌కు మద్దతుగా ఆయన ప్రచారం చేయనున్నారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయకముందే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్రంలో రెండు దఫాలుగా పర్యటించారు. ఎన్నికల నోటిఫికేషన్, రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థుల జాబితాను వెల్లడించిన తర్వాత అమిత్‌షా ఈనెల 4వ తేదీన తొలిసారి పర్యటనకు రానున్నారు. ఇందుకోసం బీజేపీ శ్రేణులు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. 4న కన్నియాకుమారిలో జరిగే భారీ బహిరంగ సభలో అమిత్‌షా పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సభలో కోయంబత్తూరు బీజేపీ అభ్యర్థి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలైతో పాటు ఆ పార్టీ నేతలు హాజరుకానున్నారు. అయితే, అమిత్ షా పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ వెల్లడికావాల్సి ఉంది.

ఏప్రిల్ మొదటి వారంలో
రాహుల్ పర్యటన



ప్యారీస్, మార్చి 28: రాష్ట్రంలో ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఆలిండియా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రచారం చేయనున్నారు. కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి, విరుదునగర్ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్, డీఎంకే కూటమి అభ్యర్థులు పాల్గొనే వేదికపై ఏప్రిల్ మొదటి వారంలో రాహుల్ గాంధీ ప్రచారం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అదే విధంగా కరూర్, దిండుగల్, ఈరోడ్, తిరుచ్చి నియోజకవర్గాల తరఫున ఒక ప్రాంతంలో, కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం నియోజకవర్గాల తరఫున ఒక ప్రాంతం, తిరువళ్లూర్, శ్రీపెరుంబుదూర్, కాంచీపురం నియోజకవర్గాల్లో ఒక ప్రాంతంలో బహిరంగ సభలు నిర్వహించేందుకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ, డీఎంకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్, డీపీఐ పార్టీలు ప్రయత్నాలు చేపట్టాయి. ఈ సభల్లో కూటమి పార్టీల అగ్రనేతలతో పాటు రాహుల్ గాంధీ కూడా పాల్గొంటారని, ఆయన పర్యటన తేది ఎప్పుడన్నది త్వరలో ప్రకటిస్తారని రాష్ట్ర కాంగ్రెస్ నిర్వాహకులు తెలిపారు.

నామినేషన్ల పరిశీలన
షురూ



పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలంటూ ఇళ్లపై నల్లజెండాలు ఎగురవేసి ఆందోళన జరుపుతున్న తిరువణ్ణామలై జిల్లా సెంగుణం కొల్లైమేడువాసులు

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నామినేషన్ల ఘట్టం ముగియడంతో గురువారం రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల పరిశీలనలో రిటర్నింగ్ అధికారులు తలమునకలయ్యారు. పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లోని కలెక్టరేట్లు, కార్పొరేషన్ కార్యాలయాల్లో ఈ నామినేషన్లను పరిశీలిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా తమ ప్రత్యర్థుల నామినేషన్లలో ఏవైనా తప్పుదొర్లాయా అని నిశితంగా పరిశీలించి అధికారుల వద్ద అభ్యంతరాలు తెలియజేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,749 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఒక్కో అభ్యర్థి రెండు మూడు నామినేషన్లు సమర్పించడంతో, శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ తర్వాత నామినేషన్లు దాఖలు చేసినవారి సంఖ్య 1403కు తగ్గుతుందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహూ తెలిపారు. రాష్ట్రంలో గరిష్ఠంగా కరూరులో 62 నామినేషన్లు, ఉత్తర చెన్నైలో 54 నామినేషన్లు, కోయంబత్తూరులో 53 నామినేషన్లు దాఖలయ్యాయని చెప్పారు. ఇక కనిష్ఠంగా నాగపట్టినంలో 13 మంది, చిదంబరంలో 22 మంది నామినేషన్లు సమర్పించినట్లు చెప్పారు. ఇక నామినేషన్ల పరిశీలన రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో గురువారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. రాజధాని నగరం చెన్నై పరిధిలో ఉన్న ఉత్తర చెన్నై నియోజకవర్గంలో పోటీకి నామినేషన్లు దాఖలు చేసిన అన్నాడీఎంకే అభ్యర్థి రాయపురం మనో, డీఎంకే అభ్యర్థి కళానిధి వీరాసామి, బీజేపీ అభ్యర్థి పాల్ కనకరాజ్ గురువారం ఉదయం వాషర్‌మెన్‌పేటలోని రాయపురం జోనల్ కార్యాయలంలోని రిటర్నింగ్ అధికారి ఎదుట హాజరయ్యారు. తొలుత బీజేపీ అభ్యర్థి కనకరాజ్ నామినేషన్‌ను అంగీకరిస్తున్నట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అన్నాడీఎంకే అభ్యర్థి రాయపురం మనో నామినేషన్‌తో జతపరచిన దస్తావేజులలో ఆయనపై నమోదైన పాతకేసుల వివరాలు తెలుపలేదంటూ డీఎంకే అభ్యర్థి అభ్యంతరం తెలపటంతో పరిశీలనను మధ్యాహ్నం వాయిదా వేశారు. ఇక డీఎంకే అభ్యర్థి కళానిధి వీరాసామి నామినేషన్ సమర్పించే సమయంలో ఎన్నికల విధులను ఉల్లంఘించారని రాయపురం మనో అభ్యంతరం తెలిపారు. దీంతో కళానిధి నామినేషన్ పరిశీలనను కూడా మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఆ తర్వాత ఆ ఇరువురి నామినేషన్లను అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఇదే విధంగా నీలగిరిలో డీఎంకే అభ్యర్థి ఎ.రాజా నామినేషన్‌లో కొన్ని తప్పిదాలు ఉన్నాయంటూ ప్రత్యర్థి పార్టీలకు చెందిన అభ్యర్థులు అభ్యంతరం తెలిపారు. అధికారులు నామినేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన మీదట దాన్ని అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఇదే విధంగా అన్నాడీఎంకే అభ్యర్థి లోకేష్ తమిళ్ సెల్వన్ నామినేషన్ పరిశీలనను కాసేపు నిలిపివేశారు. ఆ తర్వాత దాన్ని అంగీకరించినట్లు అధికారి ప్రకటించారు.

సేలంలో..

సేలం నియోజకవర్గంలో డీఎంకే తరఫున పోటీ చేస్తున్న సెల్వ గణపతి నామినేషన్‌పై అన్నాడీఎంకే, పీఎంకే అభ్యర్థులు అభ్యంతరాలు తెలిపాయి. సెల్వగణపతికి సేలం వెస్ట్, సేలం నార్త్ శాసనసభ నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నారంటూ అన్నాడీఎంకే, పీఎంకే అభ్యర్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సెల్వగణపతి ఆస్తులను తగ్గించి ప్రకటించారంటూ స్వతంత్ర అభ్యర్థులు అభ్యంతరం తెలిపారు. దీనితో ఆయన నామినేషన్‌ను మధ్యాహ్నం దాకా పెండింగ్‌లో ఉంచారు. అధికారుల నిశిత పరిశీలన తర్వాత సెల్వ గణపతి నామినేషన్‌ను అంగీకరించారు. ఇదే విధంగా తేని నియోజకవర్గం అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం అభ్యర్థి టీటీవీ దినకరన్ నామినేషన్‌లో తనపై నమోదైన కేసుల వివరాలను స్పష్టంగా అర్థమయ్యేలా వివరించలేదని డీఎంకే, అన్నాడీఎంకే, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కరూరు బీజేపీ అభ్యర్థి సెంథిల్ నాథన్ నామినేషన్‌లో స్వల్పతప్పిదాలు ఉండడంతో ఆ నామినేషన్‌ను కూడా కాసేపు పెండింగ్‌లో ఉంచి అటు పిమ్మట అంగీకరించారు. సెంట్రల్ చెన్నై డీఎంకే అభ్యర్థి దయానిధి మారన్, డీఎండీకే అభ్యర్థి పార్థసారథి నామినేషన్లను అంగీకరించినట్లు అధికారులు ప్రకటించారు. దక్షిణ చెన్నైలో డీఎంకే అభ్యర్థి తమిళచ్చి తంగపాండ్యన్, బీజేపీ అభ్యర్థి తమిళిసై సౌందరరాజన్ నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. కోయంబత్తూరులో బీజేపీ అభ్యర్థి అన్నామలై, శ్రీపెరుంబుదూరు డీఎంకే అభ్యర్థి టీఆర్ బాలు, విరుదునగర్ బీజేపీ అభ్యర్థి నటి రాధిక, డీఎండీకే అభ్యర్థి విజయప్రభాకరన్, ధర్మపురి పీఎంకే అభ్యర్థి సౌమ్యా అన్బుమణి, కడలూరు కాంగ్రెస్ అభ్యర్థి విష్ణుప్రసాద్, పీఎంకే అభ్యర్థి తంగర్‌బచ్చన్ నామినేషన్లను అంగీకరించినట్లు అధికారులు ప్రకటించారు. ఇదే విధంగా రామనాథపురంలో మాజీ ముఖ్యమంత్రి ఒ. పన్నీర్‌సెల్వం, ముస్లింలీగ్ అభ్యర్థి నవాజ్ ఘనీ, తూత్తుకుడిలో కనిమొళి నామినేషన్లను కూడా ఆమోదించారు. ఇక తిరునల్వేలి నియోజకవర్గంలో అధికారిక కాంగ్రెస్ అభ్యర్థి రాబర్ట్ బ్రూస్‌కు వ్యతిరేకంగా మాజీ కాంగ్రెస్ ఎంపీ రామసుబ్బు దాఖలు చేసిన నామినేషన్లను గురువారం వెనక్కు తీసుకున్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు తాను పోటీ నుంచి తప్పుకుంటున్నానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సరైన దస్తావేజులు సమర్పించని నామినేషన్లు వందల సంఖ్యలో ఉన్నాయని, వాటిని వీలైనంత త్వరగా నిరాకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 30న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుందని, అదే రోజు సాయంత్రం అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామని వివరించారు.

● కొత్త సచివాలయ నిర్మాణంలో అవినీతి
అన్నాడీఎంకే అప్పీలు పిటిషన్
తోసివేత



చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓమందూరార్ ఎస్టేట్ ప్రాంతంలో డీఎంకే ప్రభుత్వ హయంలో కొత్త సచివాలయ భవనాల నిర్మాణంలో అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ దాఖలు చేసిన పిటిషన్ తోసివేయడాన్ని సవాలు చేస్తూ అన్నాడీఎంకే సమర్పించిన అప్పీలును హైకోర్టు గురువారం తోసిపుచ్చింది. రాష్ట్రంలో 2006-11 మధ్య డీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొత్త సచివాలయాన్ని నిర్మించారు. ఆ సచివాలయ భవనాల నిర్మాణంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఏర్పాటైన జస్టిస్ ఆర్.రఘుపతి కమిషన్‌ను హైకోర్టు రద్దు చేసింది. ఆ కమిషన్ సేకరించిన ఆధారాల్లో వాస్తవాలు ఉంటే కేసు నమోదు చేసి విచారణ జరపాలంటూ రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ)కు ఉత్తర్వు జారీ చేసింది. ఆ ప్రకారం అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హైకోర్టు ఉత్తర్వు వెలువడింది. ఏసీబీ అధికారులు విచారణకు సిద్ధమవుతున్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్, డీఎంకే సీనియర్ నేత దురైమురుగన్ ఏసీబీ విచారణను నిలుపుదల చేసే ఉత్తర్వులివ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు అన్నాడీఎంకే ప్రభుత్వం ఏసీబీకి జారీ చేసిన ఉత్తర్వును రద్దు చేసింది. హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వం అప్పీలు చేసుకుంది. ఆ అప్పీలు విచారణకు రాకముందే రాష్ట్రంలో స్టాలిన్ నాయకత్వంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అన్నాడీఎంకే ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలును వెనక్కు తీసుకోవడానికి ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. డీఎంకే ప్రభుత్వం సమర్పించిన పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ అన్నాడీఎంకే మాజీ ఎంపీ జయవర్ధన్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు జయవర్ధన్ పిటిషన్‌పై కూడా విచారణ జరిపిన న్యాయమూర్తులు సురేష్‌కుమార్, కుమరేష్‌బాబుతో కూడిన ధర్మాసనం గురువారం ఉదయం తీర్పు వెలువరించింది. ఈ వ్యహారంలో హైకోర్టు సింగిల్‌జడ్జి వెలువరించిన ఉత్తర్వును సవాలు చేస్తూ కేసును నడపాలని ప్రభుత్వాన్ని ఆదేశించలేమని ధర్మాసనం పేర్కొంది. అప్పీలు పిటిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవడానికి అనుమతించింది. అదే సమయంలో అన్నాడీఎంకే తరఫున ఆ పార్టీ మాజీ ఎంపీ జయవర్ధన్ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్లు ధర్మాసనం ఉత్తర్వు జారీ చేసింది.

ఎన్నికల వేళ
మెగా తనిఖీలు

● రాజకీయ నేతలే లక్ష్యం

వ్యూహరచనలో ఐటీ, ఈడీ అధికారులు

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసి అభ్యర్థులకు మద్దతుగా ప్రధాన పార్టీల నాయకులంతా ప్రచారానికి బయలుదేరిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మెగా తనిఖీలు, సోదాలు నిర్వహించడానికి ఆదాయపు పన్నుల శాఖ (ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు సిద్ధమవుతున్నారు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా మెగా తనిఖీలు జరిపేందుకు ఈ రెండు విభాగాలు తగు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఈడీ, ఎన్‌ఐఏ తనిఖీలు అక్కడక్కడా జరిగాయి. కొద్ది రోజులకు ముందు అన్నాడీఎంకే మాజీ మంత్రి విజయభాస్కర్ నివాసగృహంలో ఈడీ తనిఖీలు జరిగిన విషయం తెలిసిందే. అదే రోజు నగరంలోని ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థకు చెందిన కార్యాలయాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. ఇదిలా ఉంటే కోయంబత్తూరులో కారులో పేలుడు జరిగిన సంఘటనకు సంబంధించిన దర్యాప్తు కొనసాగింపులో భాగంగా ఎన్‌ఏఐ అధికారులు చేసిన హడావుడి అంతాఇంతా కాదు. ఈ పరిస్థితులలో రాష్ట్రంలో పాలకపక్షం, ప్రధాన ప్రతిపక్షం ప్రముఖ నేతలను టార్గెట్‌గా చేసుకుని అక్రమ నగదు బట్వాడాల పేరుతో భారీ స్థాయిలో తనిఖీలు జరిపేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో వీవీఐపీలుగా ఉన్న నేతల ఇళ్లలో త్వరలో తనిఖీలు జరపనున్నారు. వచ్చే రెండు వారాల్లో 50కి పైగా ప్రాంతాల్లో ఒకే సమయంలో ఓ వైపు ఐటీ, మరో వైపు ఈడీ అధికారులు మెగా తనిఖీలు జరపనున్నారు. ఈ వీవీఐపీలకు అత్యంత సన్నిహితుల ఇళ్ల, కార్యాలయాల్లో, వాణిజ్య సంస్థలల్లో ఒకే సమయంలో దాడులు జరిపేందుకు సరం జామా సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల వేళ ఈ విధంగా మెగా తనిఖీలు జరిపితే ఎన్నికల ఫలితాలు తలకిందులయ్యే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు ఇక మూడు వారాలే ఉన్నాయని, ఈలోగా తనిఖీలు, సోదాలు జరిగితే ఆయా రాజకీయ నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలకు చెడ్డపేరు వస్తుందని, అదే జరిగితే ఆ పార్టీలకు ఓటమి, లేదా తక్కువ ఓట్లు పోలవుతాయని భావిస్తున్నారు. రాష్ట్రంలో వేళ్లానుకుని ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బడా నాయకుల ఇళ్లలో, కార్యాలయాల్లో పెద్ద యెత్తున కనీసం వందమందిని వెంటబెట్టుకుని వెళ్లి తనిఖీలు జరపాలని ఈడీ, ఐటీ అధికారులు పథకాలు సిద్ధం చేసుకుంటున్న సమాచారం. ఈ విషయమై ఈడీకి చెందిన అధికారి ఒకరు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలను గానీ, వ్యక్తులు, లేదా ప్రముఖులను టార్గెట్‌గా పెట్టుకుని దాడులు జరపడం లేదని, తమకు అందిన రహస్య సమాచారం మేరకు ఆయా సంస్థలు, లేదా వ్యక్తులు అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు లభిస్తే క్షణం ఆలస్యం చేయకుండా తనిఖీలకు వెళతామని చెప్పారు. అదే విధంగా ఎన్నికల సమయంలో దాడులకు తనిఖీలకు వెళ్లకూడదనే నిబంధనలు తమకు వర్తించవని, ఏ సమయంలోనైనా ఉన్నతాధికారుల నుండి ఆదేశాలొస్తే ఆగమేఘాలపై వెళ్లి నిర్దేశిత ప్రాంతాల్లో తనిఖీలు చేసి తీరుతామని ఇందులో ఎలాంటి పక్షపాత వైఖరికి తావుండదన్నారు. అవినీతి అక్రమాల స్థాయి అత్యధికంగా ఉంటే 50 చోట్ల కాదు 100 చోట్ల కూడా తనిఖీలు చేసేందుకు తాము సిద్ధంగా ఉంటామన్నారు. అంతేకాకుండా తమ కార్యాలయాల్లో అధికారులంతా ఎల్లప్పుడు అధిక సంఖ్యలో వచ్చి వెళుతుంటారని, ఏ సమయంలో ఏ ప్రాంతంలో దాడులకు వెళ్ళమంటారోనని ఎదురు చూస్తూ వుంటారని ఆయన వివరించారు.

గ్రూపు-1లో 90 ఖాళీలు

● జూన్ 13న మెయిన్స్ పరీక్ష

అడయార్, మార్చి 28: రాష్ట్ర వ్యాప్తంగా గ్రూపు-1 పోస్టులకు సంబంధించి 90 ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టులను భర్తీ చేసేందుకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే మెయిన్స్ రాత పరీక్షను జూన్ 13వ తేదీన నిర్వహించనున్నారు. రాష్ట్రంలో గ్రూపు-1, గ్రూపు-2, గ్రూపు-2ఏ, గ్రూపు-4 పోస్టులను తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో భర్తీ చేస్తుంటారు. ఇందులోభాగంగా డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ వంటి గ్రూపు-1 పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షను నిర్వహించనున్నారు. 16 డిప్యూటీ కలెక్టర్ పోస్టులు, 23 డీఎస్పీ పోస్టులు, 14 కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు, 21 కోఆపరేటివ్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు, 14 రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు, జిల్లా ఉపాధి కల్పనాధికారి పోస్టు ఒకటి ఇలా మొత్తం 90 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పరీక్షలకు సంబంధించిన పూర్తి నోటిఫికేషన్‌ను "www.tnpsc.gov.in'లో చూసి తెలుసుకోవచ్చు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 27వ తేదీ అర్ధరాత్రి 11.59 గంటల వరకు అవకాశం కల్పించారు.మే2వ తేదీ నుంచి మే 4వ తేదీ వరకు దరఖాస్తుల్లో తప్పులను సరి చేసుకునే అవకాశం కల్పించారు.



రంజాన్ వేళలు

శుక్రవారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.27
శనివారం : సహర్ : ఉదయం - 4.26



నేడు గుడ్‌ఫ్రైడే

● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్యారీస్, మార్చి 28: యేసుక్రీస్తు శిలువపై ప్రాణ త్యాగం చేసిన ఘట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు శుక్రవారం శుభ శుక్రవారంగా జరుపుకోనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనల కోసం చర్చిలను సిద్ధం చేశారు. శిలువపై వేలాడుతూ మరణించే ముందుకు యేసు ప్రభువు పలికిన ఏడు మాటలపై సంఘ కాపరులు, బోధకులు ప్రసంగించనున్నారు. నాగపట్టినం జిల్లా వేలాంకన్ని పుణ్యక్షేత్రంలో, చెన్నై బిసెంట్ నగర్ వేలాంకన్ని చర్చిలో, ప్యారీస్ సెయింట్ ఆంథోని చర్చి, సెయింట్ థామస్ మౌంట్ చర్చి, సైదాపేట లిటిల్ మౌంట్ చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథడ్రల్ చర్చి, సీఎస్ఐ, చర్చి ఆఫ్ సౌత్ ఇండియా, మారనాత, తెలుగు బాప్టిస్ట్ చర్చిల్లో శుభ శుక్రవారం సందర్భంగా శిలువ ధ్యాన ఆరాధన నిర్వహిస్తారు. భస్మ బుధవారం నుంచి ఉపవాస ప్రార్థనల్లో పాల్గొంటున్న క్రైస్తవులు శుక్రవారం ఆరాధన అనంతరం ఆహారం తీసుకుంటారు. ముందుగా యేసుక్రీస్తు శిలువలో ప్రాణాలు కోల్పోయే ముందు రోజైన గురువారాన్ని మాండీ గురువారంగా పాటించారు. ఈ సందర్భంగా చర్చిల్లో నిర్వహించిన ప్రభు రాత్రి సంస్కారంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

సమాచార ధ్వని

చెన్నై - నాగర్‌కోయిల్ వందే భారత్ రైళ్లు

ఐసిఎఫ్, మార్చి 28: ప్రయాణికుల రద్దీ నియంత్రించేలా చెన్నై ఎగ్మూర్ - నాగర్‌కోయిల్ మధ్య వందే భారత్ ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఎగ్మూర్ నుంచి ఈనెల 30, 31 తేదీల్లో తెల్లవారు జామున 5.15 గంటలకు బయల్దేరే వందేభారత్ మధ్యాహ్నం 2.10 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. నాగర్‌కోయిల్ నుంచి మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి రాత్రి 11.45 గంటలకు ఎగ్మూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు తాంబరం, విల్లుపురం, తిరుచ్చి, దిండుగల్, మదురై, విరుదునగర్, తిరునల్వేలి స్టేషన్లలో ఆగుతాయి.

రేపు పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

ఐసిఎఫ్, మార్చి 28: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శనివారం యథావిధిగా పనిచేస్తాయని రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది. ఆర్థిక సంవత్సర ఆఖరి రోజైన ఈ నెల 31వ తేది కార్యాలయాలు పనిచేసేందుకు అనుమతి ఇస్తుంటారు. ఈ ఏడాది మార్చి 31 ఆదివారం వస్తుండడంతో శనివారం కార్యాలయాలు పనిచేయాలని రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ రోజు రిజిస్ట్రేషన్‌కు సాధారణ రుసుముతో పాటు ప్రత్యేక ఛార్జీలు కలిపి వసూలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

రోగులకు నాణ్యమైన ఆహారం

ఐసిఎఫ్, మార్చి 28: స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 2,400 మంది ఇన్ పేషంట్లకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆసుపత్రికి ప్రతిరోజు 12,000 మందికి పైగా అవుట్ పేషంట్లు చికిత్స కోసం వస్తుంటారు. ఇన్ పేషంట్లుగా 3,800 మంది ఉన్నారు. ఇటీవల ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచారు. అలాగే, రోగులకు ఆరోగ్యకరమైన ఆహారం అందజేసేందుకు చర్యలు చేపట్టారు. ఆ ప్రకారం, ఉదయం 6 గంటలకు పౌష్టికాహార గంజి, ఇడ్లీ, పొంగల్, ఉప్మా, 11 గంటలకు అరటి పండు, కోడిగుడ్డు, పాలు, దోసకాయ, జామ పండు, ఆరెంజ్, బియ్యపు నూకల గంజి, పెరుగు, బ్రెడ్, మధ్యాహ్నం భోజనంలో సాంబారు రైస్, పెరుగన్నం, పప్పన్నం, ఆకుకూర, సాయంత్రం 4 గంటలకు పౌష్టికాహార గంజి, గుగ్గిళ్లు, పాలు, సగ్గు బియ్యం గంజి, సూపు, బిస్కెట్లు, రాత్రి చపాతి, ఇడ్లీ, సేమియా ఉప్మా, రవ్వ కిచిడీ, ఆనియన్ చట్నీ వంటివి అందిస్తున్నారు.

ఐఐటీ పరీక్షలో పాసైన 38 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఐసిఎఫ్, మార్చి 28: ఐఐటీలో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 38 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్లస్‌టూ పూర్తి చేసిన విద్యార్థులు జాతీయ ఉన్నత విద్యాసంస్థలైన ఐఐటీ-ఎన్ఐటీ వంటి వాటిలో చేరేందుకు జేఈఈ ప్రధాన పరీక్షలో ఉత్తీర్ణత కావాల్సి ఉంది. అనంతరం అడ్వాన్సుడు పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి. దీంతో, రాష్ట్ర విద్యార్థుల్లో ఎక్కువ మంది ఈ పరీక్ష పై ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా జేఈఈకి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. 3,000 మంది శిక్షణ పొందుతుండడంతో, వారిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 38 మంది ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు.

'టాన్సెట్' ఫలితాల విడుదల

పెరంబూర్, మార్చి 28: 'టాన్సెట్' పరీక్షా ఫలితాలను అన్నా విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరేందుకు టాన్సెట్ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించిన ఈ పరీక్షా ఫలితాలు https://tancet.annauniv.edu/tancetలో విడుదలయ్యాయి. ఈ పరీక్షలకు 36,139 మంది హాజరైనట్టు అధికారులు చెప్పారు. మార్కుల జాబితా ఏప్రిల్ 3వ తేది నుండి వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని అన్నా వర్శిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో 2.80 లక్షల మంది చేరిక

పెరంబూర్, మార్చి 28: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో 2024-25వ విద్యా సంవత్సరానికి విద్యార్థుల అడ్మిషన్లు ఈ నెల 1వ తేది నుంచి ప్రారంభమైన నేపథ్యంలో, మంగళవారం లెక్కల ప్రకారం 2.80 లక్షల మంది విద్యార్థులు చేరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల అడ్మిషన్లు ముందుగానే చేపట్టింది. ఇందుకోసం ఉపాధ్యాయులు తమ తమ ప్రాంతాల్లోని తల్లిదండ్రులను కలసి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న రాయితీలు, వసతులు, బోధన తదితరాలపై అవగాహన కల్పించి వారి పిల్లలను చేర్పించేలా ప్రచారం చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 2.80 లక్షల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా, వారిలో అధికంగా సేలం జిల్లాలో 19,000 మంది ఉన్నారు. అలాగే, అంగన్వాడీల్లో చదువుతున్న 5 ఏళ్ల పైబడిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలని, ఈ ఏడాది 5 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరే అవకాశముందని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

నామినేషన్‌తో మెడికల్ రిపోర్ట్

● తీర్పు వాయిదా వేసిన హైకోర్టు

పెరంబూర్, మార్చి 28: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, తమ నామినేషన్‌తో పాటు వైద్య పరీక్షల నివేదిక దాఖలు చేయాలనే పిటిషన్‌పై తీర్పు తేది ప్రకటించకుండా మద్రాసు హైకోర్టు వాయిదా వేసింది. నామినేషన్ దాఖలుకు 30 రోజులకు ముందుగా సదరు అభ్యర్థులు వైద్య పరీక్ష నివేదికను దాఖలుచేసేలా ఉత్తర్వులు జారీచేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ కేసుకు సంబంధించి, అభ్యర్థుల ఆరోగ్యంపై పరిశోధన నివేదిక అందజేయడం సంబంధిత వ్యక్తుల వ్యక్తిగత విషయమని ఎన్నికల సంఘం అఫిడవిట్‌లో పేర్కొంది.

ముందుగానే ఓట్ల లెక్కింపు చేపట్టాలి

● పిటిషన్ తిరస్కృతి

అడయార్, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును ముందుగానే చేపట్టాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో దాఖలైన పిటిషన్ కొట్టివేతకు గురైంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తమిళనాడులో తొలి దశ పోలింగ్ ఏప్రిల్ 19వ తేదీన జరగనుంది. కానీ, ఓట్ల లెక్కింపు మాత్రం జూన్ 4న జరుగుతుందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే, పోలింగ్‌కు, ఓట్ల లెక్కింపునకు మధ్య విరామ సమయం చాలా రోజులు ఉందని, అందుల్ల ఓట్ల లెక్కింపును ముందుగానే చేపట్టి ఫలితాలను వెల్లడించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

ఇండియా కూటమికి మద్దతుగా ఇళయ కట్టబొమ్మన్ ప్రచారం



ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్న ప్రాంతాల జాబితా ఆవిష్కరిస్తున్న ఇళయ కట్టబొమ్మన్

ప్యారీస్, మార్చి 28: భారత్ భూభాగాలను ఆక్రమించుకుంటున్న పాకిస్తాన్, చైనా దేశాల ఆగడాలను అడ్డుకోకుండా చోద్యం చూపుతున్న బీజేపీని ఈ లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించేలా ఇండియా కూటమికి మద్దతుగా ప్రచారం చేపట్టనున్నట్లు వీర పాండ్య కట్టబ్రహ్మన్న మక్కల్ మున్నేట్ర ఫ్రంట్ (వీకేఎంఎంఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇళయ కట్టబొమ్మన్ ప్రకటించారు. ఈ మేరకు చెన్నై ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థులకు మద్దతుగా తన ఫ్రంట్ తరఫున ప్రచారం చేసినట్లే ఈ లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇండియా కూటమికి మద్దతుగా అన్ని నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొంటామని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ల అవుతున్నా సమరయోధులకు సక్రమంగా పింఛన్లు అందడం లేదని, ఆ కుటుంబాల డిమాండ్లను పరిశీలించకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని మండిపడ్డారు. విదేశాల్లో పనిచేస్తున్న ప్రవాస భారతీయులకు, సముద్రంలో చేపల వేటకు వెళ్లే తమిళ జాలర్లకు రక్షణ కరువైందని, తాజాగా బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి కూడా ప్రధాని మోదీని గెలిపించకూడదని ప్రజలకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఫ్రంట్ నిర్వాహకులు దేవకి రాజ్, సురేష్, శ్యాంసన్, శశికుమార్, ప్రదీష్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో మూడు నియోజకవర్గాలకు ఎన్నికల పర్యవేక్షకుల నియామకం

ప్యారీస్, మార్చి 28: రాజధాని నగరం చెన్నైలోని మూడు నియోజకవర్గాలకు ఎన్నికల పర్యవేక్షకులను నియమించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు, పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశమయ్యేందుకు ముగ్గురు కేంద్ర ప్రభుత్వ అధికారుల పేర్లు, వారి సెల్ ఫోన్ నెంబరు, వారు ఏఏ ప్రాంతాల్లో ఏ సమావేశం అవుతారన్న వివరాలను ఈసీ ప్రకటించింది. ఉత్తర చెన్నైలో కార్తికేతన్‌జీ బుద్ధపట్టి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. చేపాక్కం ప్రాంతంలోని వాలాజా రోడ్డులో ఉన్న ప్రభుత్వ అతిథి గృహంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఆయనను నేరుగా సంప్రదించవచ్చు. ఆయన సెల్‌ఫోన్ నెం.9445910953. సెంట్రల్ చెన్నై ఎన్నికల పర్యవేక్షకుడి సురేష్‌ను చేపాక్కం ప్రభుత్వ అతిథిగృహంలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సంప్రదించవచ్చు. ఆయన సెల్‌ఫోన్ నెం.9445910956. దక్షిణ చెన్నై నియోజకవర్గంలో ఎన్నికల పనుల పర్యవేక్షకుడిగా ఎం.రవిచంద్ర నియమితులయ్యారు. ఆయన్ను కూడా ఈ అతిథిగృహంలోనే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంప్రదించవచ్చు. ఆయన సెల్‌ఫోన్ నెం.9445910957.

మద్రాసు వర్శిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో 5న ఉగాది వేడుకలు

అడయార్, మార్చి 28: మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీన 'శ్రీ క్రోధి' నామ సంవత్సర వేడుకలు జరగనున్నాయి. వర్శిటీకి చెందిన మెరీనా క్యాంపస్ ఆవరణలోని రజతోత్సవ ప్రాంగణంలో ఈ వేడుకలు జరగనున్నాయి. అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతంతో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి డాక్టర్ పాండురంగం కాళియప్ప స్వాగతోపన్యాసం, పెరంబూరు తెలుగు సాహితీ సమితి కార్యదర్శి డాక్టర్ టీఎస్ఆర్ శర్మ పంచాంగ పఠనం చేస్తారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర పాల్గొంటారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు, పాత్రికేయురాలు కమలాకర రాజేశ్వరి ఉగాది ఉపన్యాసం చేస్తారు. ఉదయం 11 గంటలకు భువనచంద్ర చేతుల మీదుగా పుస్తకావిష్కరణ ఉంటుంది. ఈ పుస్తక తొలి ప్రతిని సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ అద్దేపల్లి పురుషోత్తం స్వీకరిస్తారు. ఆ తర్వాత లింగంనేని సుజాత రచించిన 'మనిషి కథలు (కథా సంపుటి)'ని విశ్రాంత ఆచార్యులు లింగంనేని బసవ శంకర రావుకు అంకితమిస్తారు. గుడిమెట్ల చెన్నయ్య 'ఎక్కడుంది న్యాయం' (కవిత్వం) పుస్తకాన్ని డాక్టర్ మామిడి మురళి సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు తెలుగు శాఖ ఉగాది పురస్కారం 2024ను విశాఖపట్టణం ఆంధ్రా విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు చెందిన డాక్టర్ బూసి వెంకటస్వామికి ప్రదానం చేస్తారు. మధ్యాహ్నం 1 గంటకు భోజన విరామం ఉంటుంది. మధ్యాహ్నం 1.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎస్.శశికళ స్వాగతం పలుకుతారు. ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహిస్తారు. ఆత్మీయ అతిథిగా తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తమ్మినేని బాబు, సినీ గేయ రచయిత భువనచంద్ర కవి సమ్మేళన ప్రారంభ ఉపన్యాసం, నిడమర్తి వసుంధరా దేవి కవిసమ్మేళన నిర్వహణ చేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు 'ఆనంద లహరి' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో అరుణాశ్రీనాథ్, నిడమర్తి వసుంధరాదేవి, వంజరపు శివయ్య, జె.తిరుపతయ్య, విస్తాలి శంకరరావులు గానాలాపన చేస్తారని, ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

మూడు నెలల్లో 21,718 మంది క్షయ బాధితులకు చికిత్స

ఐసిఎఫ్, మార్చి 28: మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 21,718 మంది క్షయ బాధితులకు చికిత్సలందించినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. క్షయ రోగ నిర్మూలనకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలతో పాటు శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్సలందిస్తోంది. దీని ద్వారా బాధితుల్లో 84 శాతం మందికి మొదటి దశ చికిత్సతోనే పూర్తిగా నయమవుతోంది. గత మూడు నెలల్లో దేశవ్యాప్తంగా 5.15 లక్షల మంది బాధితులకు చికిత్సలందించగా, రాష్ట్రంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో 5,496 మంది, ప్రభుత్వాసుపత్రుల్లో 16,222 మంది చికిత్స పొందారు.

917 చైన్ పుల్లింగ్ కేసులు

ఐసిఎఫ్, మార్చి 28: రైలులో చైన్ లాగినందుకు ఒకే ఏడాది 917 కేసులు నమోదుచేసి, రూ.5 లక్షలకు పైగా జరిమానా వసూలు చేసినట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. రైళ్లలో అత్యవసర సమయాల్లో రైళ్లు ఆపేందుకు అలారమ్ చైన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కారణం లేకుండా చైన్ లాగితే రూ.1,000 జరిమానా, ఏడాది జైలుశిక్ష విధిస్తున్నారు. ఈ నేపథ్యంలో, గత ఏడాది మాత్రమే చెన్నై డివిజన్‌లో అనవసరంగా అలారమ్ చైన్ లాగిన 917 మందిపై కేసు నమోదు చేసి, రూ.5,76,905 జరిమానా వసూలుచేసినట్లు అధికారులు తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్ వద్ద రూ.1.20 లక్షల స్వాధీనం

వేలూరు, మార్చి 28: స్థానిక కాట్పాడి సమీపం క్రిస్టియన్‌పేట చెక్‌పోస్ట్‌లో గురువారం ఉదయం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పసుమాత్తూర్‌కు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ వీరమణిని తనిఖీ చేసిన అధికారులు, అతని వద్ద రూ.1,20,400 నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రజల నుంచి వసూలుచేసిన పాలసీ సొమ్ము అని వీరమణి తెలుపగా, అందుకు సంబంధించిన ఆధారాలు తీసుకొస్తే నగదు తిరిగి ఇస్తామని తెలిపిన అధికారులు, నగదును కాట్పాడి తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించారు.

పక్షవాత రోగులు నడిచేందుకు సరికొత్త పరికరాలు



పరికరాన్ని ఆవిష్కరిస్తున్న రవీంద్రనాథ్ సింగ్, క్లినిక్ చైర్మన్ డాక్టర్ జగదీశన్ తదితరులు

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్‌లోని జేకే ఫిజియో అండ్ రీహబ్ క్లినిక్‌లో పక్షవాతానికి గురైన రోగులు సులువుగా నడవగలిగే అధునాత ఎక్సోస్కెలెటల్ న్యూరో పరికరాలను ప్రారంభించారు. ఆసియాలోనే మొట్టమొదటిసారిగా వృద్ధాప్యం కారణంగా, వెన్నెముక దెబ్బతినడం వల్ల వచ్చే పక్షవాత రోగులు సులువుగా నడవగలిగేలా తక్కువ బరువుతో ధరించగలిగే ఎక్సోస్కెలెటల్ రోబోద్వారా ఈ పరికరాలను ఉపయోగించ వచ్చని క్లినిక్ నిర్వాహకులు తెలిపారు. ఈ పరికరాలను రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రనాథ్ సింగ్ ఆవిష్కరించారు. క్లినిక్ చైర్మన్ డాక్టర్ జగదీశన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె.కల్పన, తంజావూరు డీఐసీ జనరల్ మేనేజర్ మణివన్నన్, ఆర్థోసర్జన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిప్యూటీ తహసీల్దారు ఆత్మహత్య

అడయార్, మార్చి 28: సేలం జిల్లా మేట్టూరు డిప్యూటీ తహసీల్దారు నర్మద (37) ఆత్మహత్య చేసుకున్నారు. ఈమె బుధవారం రాత్రి తమ నివాసంలోనే ఫ్యానుకు ఉరేసుకున్నారు. భార్య ఉరేసుకున్న విషయాన్ని గమనించిన భర్త వెంటనే పోలీసులకు సమాచారం చేరవేశారు. వారు నర్మద మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కాగా ఈమె భర్త కూడా శబరి మేట్టూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ గ్రేడ్ రెవెన్యూ అధికారి. భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగులు కావడం, వీరికి ఎలాంటి ఆర్థిక కష్టాలు కూడా లేకపోవడంతో నర్మద ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారు? అనే అంశంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కోల్పోయిన నగదు బాధితులకు అప్పగింత



బాధితులకు నగదు అందజేస్తున్న జిల్లా ఎస్పీ మణివన్నన్

వేలూరు, మార్చి 28: ఆన్‌లైన్‌లో కోల్పోయిన నగదును పోలీసులు బాధితులకు అప్పగించారు. కాట్పాడి కల్పుదూర్‌కి చెందిన కేశవన్ ఆంధ్ర రాష్ట్రం చిత్తూరులో ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో మేనేజర్. ఇటీవల అతనికి బ్యాంక్ అధికారులమంటూ ఫోన్ చేసిన వ్యక్తి, అతని క్రెడిట్ కార్డు వివరాలు అడిగాడు. వివరాలు చెప్పిన కొద్దిసేపటికే కేశవన్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.90 వేలు డ్రా చేసినట్లు మేజేస్ రావడంతో, అతను సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, వల్లాండరామ్ ప్రాంతానికి చెందిన సురేష్ వాట్సాప్‌లో తక్కువ ధరకు వస్తువులు అనే ప్రకటన నమ్మి రూ.20 వేలు మోసపోయాడు. బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు నగదును వెనక్కు తెప్పించారు. ఆ నగదును గురువారం ఎస్పీ మణివన్నన్ బాధితులకు అప్పగించారు.

టోల్ ఫీజుల పెంపు : లారీలపై అదనపు భారం

అడయార్, మార్చి 28: టోల్ ఫీజులను పెంచడంతో రాష్ట్రంలోని లారీ నిర్వహణపై అదనపు భారం పడుతుందని తమిళనాడు రాష్ట్ర లారీ యజమానుల సంఘం ఆందోళన వ్యక్తం చేస్తుంది.తాజా పెంపువల్ల చెన్నైనుంచి ముంబైకు వెళ్లేందుకు ఒక్కో లారీపై రూ.1000 మేరకు అదనపు భారం పడుతుందని అంచనా వేశారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై 566 టోల్‌ప్లాజాలుండగా ఒక్క తమిళనాడులోనే 55 టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వీటిని రెండుగా విభజన చేసి, ప్రతి రెండేళ్ళకు ఒకసారి టోల్ ఫీజులను పెంచుతున్నారు.ఆప్రకారంగా ఇపుడు ఈఫీజులను పెంచారు.ఈ పెంచిన ఫీజులు సెప్టెంబరు 1నుంచి అమల్లోకి రానున్నాయి. మిగిలిన టోల్‌ప్లాజాల్లో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెంచిన ఫీజులు వసూలు చేస్తారు. ఈ పెంచిన ఫీజులపై రాష్ట్ర లారీ యజమానుల సంఘం సమ్మేళన అధ్యక్షుడు ధనరాజ్ మాట్లాడుతూ... 2019నుంచి అన్ని టోల్‌ప్లాజాల్లో ఫాస్టాగ్‌విధానంద్వారా టోల్‌ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 29 టోల్‌ప్లాజాల్లో పెంచిన టోల్ ఫీజు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ప్రస్తుతం 5 నుంచి 10 శాతం మేరకు పెంచినట్టు కేంద్రం చెబుతోందన్నారు. ఈ ప్రభావం లారీ రవాణా చార్జీలపై పడటం వల్ల నిత్యావసర వస్తు ధరలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు.

శిక్ష ప్రకటించిన వెంటనే నిందితుడు పరార్

ప్యారీస్, మార్చి 28: స్థానిక పూందమల్లి ప్రత్యేక కోర్టులో న్యాయమూర్తి శిక్ష ప్రకటించిన వెంటనే పరారైన నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. 2018లో ఆహార భద్రత విభాగం అధికారులు పూందమల్లి సమీపంలో ఉన్న పారివాక్కం గోదాములో తనిఖీలు నిర్వహించారు. అక్కడ 5 టన్నుల గుట్కా, పొగాకు ఉత్పత్తులు ఉండడం గుర్తించి వెంటనే పూందమల్లి పోలీసులకు సమాచారం అందించారు. పూందమల్లి పోలీసులు గుట్కా స్వాధీనం చేసుకొని, ఆ గోదాము యజమాని ముత్తురామలింగాన్ని అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ పూందమల్లిలోని ప్రత్యేక కోర్టులో ముగియడంతో, 2021లో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఇందులో ముత్తురామలింగానికి మూడు నెలల జైలుశిక్షతో పాటు రూ.50,000 జరిమానా విధించారు. ఈ తీర్పు సవాలు చేస్తూ ముత్తురామలింగం తరఫున దాఖలైన అప్పీలు పిటిషన్‌పై బుధవారం న్యాయమూర్తి మురుగేశన్ తీర్పు ప్రకటించారు. నిందితుడికి మూడు నెలల శిక్ష, రూ.50,000 జరిమానా విధించినట్లు ప్రకటించారు. ఈ తీర్పు విన్న ముత్తురామలింగం రెప్పపాటులో న్యాయస్థానం నుంచి చల్లగా జారుకున్నారు. అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

వ్యభిచారం సాగిస్తున్న ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, మార్చి 28: స్థానిక చేపాక్కంలోని ఓ లాడ్జిలో వ్యభిచారం సాగిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మియాన్ సాహిబ్ 1వ వీధిలో ఉన్న లాడ్జీలో వ్యభిచారం జరుగుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. లాడ్జీలోని ఓ గదిలో వ్యభిచారం సాగిస్తున్న ట్రిప్లికేన్ ఫాకిర్‌సాహిబ్ వీధికి చెందిన ఇందాదా, అర్ముగవైద్య వీధికి చెందిన నిత్యానందన్‌ను అరెస్ట్ చేసి, వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మహిళను రక్షించిన పోలీసులు ప్రభుత్వ హోంకు తరలించారు.

లాటరీ టిక్కెట్ల విక్రేతల అరెస్ట్

పెరంబూర్, మార్చి 28: స్థానిక రామాపురంలో ప్రభుత్వం నిషేధించిన లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుమలైనగర్ ఈశ్వరన్ వీధిలో లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు రామాపురం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు, అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్, భాగ్యరాజ్, బాలాజి, సురేష్‌ను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1,42,800, 3 సెల్‌ఫోన్లు, లాటరీ టిక్కెట్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

శాస్త్రోక్తంగా వడ శబరిమలై అయ్యప్పన్ ఆలయ కుంభాభిషేకం



గోపురకలశాలపై పవిత్రజలాలను సంప్రోక్షిస్తున్న అర్చకులు, వేద పండితులు



కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న భక్తులు

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వడ శబరిమలైగా పిలిచే స్థానిక రాజా అన్నామలైపురంలోని అయ్యప్పన్‌స్వామివారి ఆలయ కుంభాభిషేక వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. పద్దెనిమిది మెట్లతో పరివార దేవతామూర్తుల సమేతంగా కొలువై ఉన్న అయ్యప్పస్వామివారి ఆలయానికి నగరవాసులు రోజూ వందల సంఖ్యలో వెళుతుంటారు. ఇటీవల ఆ ఆలయం వద్ద వినాయకస్వామి, నవగ్రహ దేవతలకు, ఆంజనేయస్వామి సన్నిధికి కొత్త గోపురాలను నిర్మించారు. ఈ నేపథ్యంలో శబరిమలై నుంచి వచ్చిన మోహన తంత్రి, పిళ్లయార్‌పట్టి కర్పగ వినాయకర్ ప్రధాన అర్చకుడు కే పిచ్చై గురుక్కల్ ఆధ్వర్యంలో గోపుర కలశాలకు కుంభాభిషేకాలు నిర్వహించారు.

దేశం సుభిక్షంగా ఉండాలంటే రాహుల్ ప్రధాని కావాల్సిందే

● ఏఐఏఎంకే అధ్యక్షుడు మామళ్లన్



కాంగ్రెస్ కూటమికి మద్దతు తెలుపుతూ టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగైకు లేఖ అందజేస్తున్న మామళ్లన్

ప్యారీస్, మార్చి 28: దేశం సుభిక్షంగా ఉండాలంటే రాహుల్‌గాంధీ ప్రధాని కావల్సిందేనని ఆలిండియా అంబేడ్కర్ మక్కల్ కళగం వ్యవస్థాపక అధ్యక్షుడు మామళ్లన్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్న కాంగ్రెస్, డీఎంకే కూటమికి మద్దతు తెలుపుతూ గురువారం ఉదయం రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌కు వెళ్లి పీసీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగైను మర్యాదపూర్వకంగా కలిసిన మామళ్లన్ ఈమేరకు లేఖ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఈ తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో మైనార్టీలు, చర్చీలు, మసీదులపై దాడులు కొనసాగాయని, కులమతాల మధ్య చిచ్చుపెట్టి ప్రైవేటు సంస్థలను ప్రోత్సహిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా తమ పార్టీ తరఫున రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రచారం చేపట్టనున్నట్లు మామళ్లన్ తెలిపారు.

యువత సంక్షేమమే ప్రధాని లక్ష్యం



సభలో ప్రసంగిస్తున్న ఏసీ షణ్ముగం

వేలూరు, మార్చి 28: యువత సంక్షేమమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని పుదియ నీతి పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగం చెప్పారు. వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున పోటీ చేస్తున్న ఆయన గురువారం కూటమి పార్టీల నేతలతో బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సభలో పీఎంకే జిల్లా సెక్రటరీ ఇళవయగన్, ఉపాధ్యక్షుడు ఎస్టీ షణ్ముగం, జిల్లా అధ్యక్షుడు వెంకటేశన్, మాజీ మంత్రి పాండురంగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ... అధికారంలో ఉన్నా, లేకున్నా వేలూరు నియోజకవర్గ అభివృద్ధి తన సొంత నిధులు వెచ్చించానని, నియోజకవర్గంలో ఉచిత వైద్య శిబిరాలు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా జాబ్ మేళా నిర్వహించానని తనను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రధాన పార్టీల నామినేషన్ల అంగీకారం

వేలూరు, మార్చి 28: వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు అంగీకరించినట్లు రిటర్నింగ్ అధికారి సుబ్బులక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గురువారం నామినేషన్ల పరిశీలన జరిగింది. డీఎంకే అభ్యర్థి కదిర్‌ఆనంద్, అన్నాడీఎంకే అభ్యర్థి పసుపతి, బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం, ఇండిపెండెంట్‌గా పోటీచేస్తున్న సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ నామినేషన్లు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.

కదిర్ ఆనంద్‌కు మద్దతుగా సీపీఎం ప్రచారం

వేలూరు, మార్చి 28: వేలూరులో డీఎంకే అభ్యర్థిగా పోటీచేస్తున్న కదిర్ ఆనంద్‌కు మద్దతుగా సీపీఎం నేతలు ప్రచారం చేపట్టారు. కేవీ కుప్పం శాసనసభ నియోజకవర్గ పరిధిలోని తట్టపారై, చిన్నాలమ్‌పల్లి, చుట్టుపక్కల గ్రామాల్లో అభ్యర్థి కదిర్ ఆనంద్‌తో కలసి సీపీఎం నేతలు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేపట్టారు.

ఓపీఎస్‌పై కోడ్ ఉల్లంఘన కేసు

ప్యారీస్, మార్చి 28: రామనాథపురంలో ఎన్నికల కోడ్ ఉల్లఘించారంటూ మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వంపై కేసు నమోదు చేసినట్లు కేనిక్కరై పోలీసులు తెలిపారు. రామనాథపురంలో పోటీచేస్తున్న నవాజ్ ఘనీ, జయపెరుమాళ్, ఓపీఎస్ ఈనెల 25న కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి వద్ద నామినేషన్ పత్రాలు దాఖలుచేశారు. ఇందుకోసం వారు తమ మద్దతుదారులతో కలసి ఊరేగింపుగా వెళ్లారు. అందువల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా కోడ్ ఉల్లంఘించారని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఆదీశ్వరన్ కేనిక్కరై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఆధారంగా ఒ.పన్నీర్‌సెల్వం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధరణి మురుగేశన్, అన్నాడీఎంకే అభ్యర్థి జయపెరుమాళ్, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మునియస్వామి, డీఎంకే జిల్లా కార్యదర్శి ఖాదర్‌బాషా, ముత్తురామలింగం, నవాజ్ ఘనీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.15లక్షల స్వాధీనం



బేకరీ దుకాణం యజమాని నుంచి స్వాధీనం చేసుకున్న కరెన్సీ కట్టలు

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తండయార్‌పేట ఇళయ వీధిలో గురువారం వేకువజాము ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ముత్తమిళ్‌సెల్వన్ నాయకత్వంలో అధికారులు జరిపిన వాహన తనిఖీల్లో బైకుపై వెళుతున్న బేకరి యజమాని కుబేంద్రన్ నుంచి రూ.15 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదుకు సంబంధించి ఎలాంటి రశీదులు, ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆ నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నామని, తగిన ఆధారాలు చూపి నగదును తిరిగి తీసుకోవచ్చునని చెప్పడంతో కుబేంద్రన్ దిగులుతో తిరుగుముఖం పట్టారు.

ధర్మపురి సమీపంలో రూ.10.45 కోట్ల నగల స్వాధీనం

ప్యారీస్, మార్చి 28: ధర్మపురి లోక్‌సభ నియోజకవర్గంలో వాహన తనిఖీలు చేపట్టిన ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది రసీదులు లేకుండా జీపులో తరలించిన రూ.10.45 కోట్ల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రధాన రహదారి కూడళ్లలో 20కి పైగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో, పాపిరెడ్డిపట్టి వెల్లయప్పన్ ఆలయం సమీపంలో వద్ద ఉన్న చెక్‌పోస్ట్‌లో అధికారి గౌరి నేతృత్వంలో పోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు. సేలం నుంచి చెన్నై వైపుకు వెళుతున్న జీపును ఆపి తనిఖీలు చేశారు. ముగ్గురి వద్ద జరిపిన విచారణలో... జువెలరీ షాపులకు సరఫరా చేసేందుకు నగదు తీసుకెళుతున్నట్లు తెలిపారు. అయితే వాటికి సంబంధించి ఎలాంటి రసీదులు లేకపోవడంతో వెండి, బంగారు నగలు స్వాధీనం చేసుకొని పాపిరెట్టిపట్టి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని ట్రెజరీలో అప్పగించారు.

పోలింగ్ కేంద్రం కోసం నల్లజెండాలతో ఆందోళన

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా సెంగుణం కొల్లైమేడు ప్రాంతంలో నివసిస్తున్న తమకు ఊరిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు ఇళ్లపై నల్లజెండాలు ఎగురవేసి ఆందోళన జరుపుతున్నారు. ఆ గ్రామంలో 700 మందికి పైగా ఓటర్లు ఉన్నారు. 75 సంవత్సరాలుగా ఊరికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి నడిచి వెళ్లి ఓటు వేయాల్సి ఉందని, తమ ఊరిలోని పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని దశాబ్దాల తరబడి సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందని మండిపడ్డారు. దీనితో ఈసారి ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

పోలింగ్ బూత్‌లలో సెల్‌ఫోన్లకు నిషేధం

ఐసిఎఫ్, మార్చి 28: పోలింగ్ బూత్‌ల్లో సెల్‌ఫోన్లో ఫొటో, వీడియో తీయడంపై ప్రధాన ఎన్నికల అధికారి సత్యప్రదసాహూ నిషేధం విధించారు. నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఏప్రిల్ 19వ తేది పోలింగ్ కోసం ఒకరోజు వేతనంతో సెలవు ప్రకటించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. భారీగా నగదు తరలింపు వాటిపై ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించాలని కోరారు. తపాలా ఓట్లకు సంబంధించిన పేర్ల జాబితా రాజకీయ పార్టీలకు అందజేశామని తెలిపారు. పోలింగ్ బూత్‌లల్లో సెల్‌ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతి లేదని పేర్కొన్నారు.



వేలూరు లోక్‌సభ నియోజకవర్గ జనరల్ సూపర్‌వైజర్‌గా నియమితులైన రూపేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

● ఇదేం శాపం?



నేను మాట్లాడేటప్పుడు లేచివెళ్తే రక్తం కక్కుకుని చస్తారు!

● అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూర్ రాజు

పెరంబూర్, మార్చి 28: మదురై లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థిగా డాక్టర్ శరవణన్ పోటీ చేస్తున్నారు. ఆయన పరిచయ కార్యక్రమం బుధవారం సెల్లూరు ప్రాంతంలో జరిగింది. ఈ సభలో మాజీ మంత్రి సెల్లూరు కె.రాజు మాట్లాడుతూ... "ఎందుకురా బాబూ ఈ మీటింగ్‌లో కూర్చొబెట్టారు అనుకొని లేచేందుకు ఎవ్వరూ ప్రయత్నించవద్దు. అందురూ కూర్చొనే ఉండాలి... ఒకవేళ నేను మాట్లాడేటప్పుడు ఎవరైనా లేచివెళ్తే రక్తం కక్కుకుని చస్తారు" అంటూ సినిమాల్లో వడివేలు తరహాలో సరదాగా శాపనార్థాలు పెట్టారు. అలాగే, సిలిండర్ ధర రూ.500 తగ్గిస్తామన్న డీఎంకే ప్రకటనను ప్రజలు నమ్మడం లేదని సెల్లూరు రాజు వ్యాఖ్యానించారు. ఆయన మాటలతో కూడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

● అన్వేషణ



శిలాఫలకాల వెతుకులాటలో దినకరన్ అనుచరులు

పెరంబూర్, మార్చి 28: తేని లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) అభ్యర్థిగా టీటీవీ దినకరన్ పోటీ చేస్తున్నారు. గతంలో పెరియకుళం నియోజకవర్గంగా ఉన్న ఈ స్థానంలో 1999లో అన్నాడీఎంకే తరఫున పోటీ చేసి విజయం సాధించారు. ఎంపీగా ఉన్న ఐదేళ్లలో తేని, మదురై జిల్లాల్లోని పలు ఆలయాలకు కుంభాభిషేకం, జీర్ణోద్ధరణ పనులకు విరాళాలు అందించారు. అలాగే, చర్చీలు, మసీదుల నిర్మాణాలకు కూడా ఆయన విరాళం అందజేశారు. ఆ సమయంలో ఆయా ప్రార్థనా స్థలాల ప్రారంభోత్సవంలో దాతలు పేరున ఏర్పాటు చేసిన శిలాఫలకాల్లో టీటీవీ దినకరన్ పేరు చోటుచేసుకుంది. ప్రస్తుతం ఈ శిలాఫలకాల వేటలో ఏఎంఎంకే నేతలు తల మునకలైవున్నారు. విరాళాలు అందజేసిన దినకరన్ దాతృత్వానికి నిదర్శనంగా ఉన్న శిలాఫలకాలు చూపుతూ అన్ని వర్గాల ఓట్లు పొందేలా ఆ పార్టీ కార్యకర్తలు ప్రచారం చేయాలని నిర్ణయించారు.

సింగంపునరి మురుకులంటే కార్తీ చిదంబరానికి ప్రీతి



పెరంబూర్, మార్చి 28: శివగంగ లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే కూటమి తరఫున కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కార్తీ చిదంబరానికి సింగంపునరి మురుకలంటే ఎనలేని ప్రీతి. పార్టీ సమావేశాలు, ఎన్నికల ప్రచారం కోసం ఆయన ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు, అక్కడ ప్రత్యేక మురుకులు రుచి చూడకుండా వెళ్లేవారు కారు. ప్రస్తుతం ఆయన ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో ప్రచారం కోసం ఆయన సింగంపునరికి వస్తే, ఆయన అడగకుండానే మురుకులు అందించాలని కార్యకర్తలు వాటిని సిద్ధం చేసుకొని ఎదురుచూస్తున్నారు.

● పాపం సామి

కృష్ణసామికి ఓపీఎస్ పరిస్థితి!



చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రామనాథపురంలో పోటీ చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వంకు ఎదురైన పరిస్థితే తెన్‌కాశిలో అన్నాడీఎంకే కూటమి తరఫున రెండాకుల గుర్తుతో పోటీకి దిగిన పుదియ తమిళగం నాయకుడు డాక్టర్ కృష్ణసామికి దాపురించింది. రామనాథపురంలో ఓపీఎస్‌కు పోటీగా అదే పేరుతో ఆరుగురు స్వతంత్రులు పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఆ రీతిలోనే డాక్టర్ కృష్ణసామి పోటీ చేస్తున్న తెన్‌కాశి నియోజకవర్గంలో బుధవారం ఆయన పేరే కలిగిన నలుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కేశవరం ప్రాంతానికి చెందిన పా.కృష్ణసామి, శివగిరి విశ్వనాథపేరి ప్రాంతానికి చెందిన ఎం.కృష్ణసామి, శంకరన్‌కోవిల్‌కు చెందిన కె.కృష్ణసామి, చిదంబరాపురానికి చెందిన వి.కృష్ణసామి పోటీ చేస్తుండటంతో పోలింగ్ సందర్భంగా అభ్యర్థుల పేరును చూసి ఓటేసేవారు తనకు బదులుగా పోటీలో ఉన్న స్వతంత్రులకు ఓటేసే అవకాశం ఉందని డాక్టర్ కృష్ణసామి ఆందోళన చెందుతున్నారు.

● ఎర్ర ప్రచారం

కామ్రేడ్ సీతారామ్ ఏచూరి ప్రచారం



చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా సీపీఐ జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మూడు రోజులపాటు ప్రచారం చేయనున్నారు. ఏప్రిల్ 11న చెన్నైలో, 12న దిండుగల్‌లో, 13న మదురైలో ఏర్పాటయ్యే ఎన్నికల ప్రచార సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు. ఇదే విధంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ప్రకాష్ కారత్ ఏప్రిల్ 6న మదురై, 7న దిండుగల్‌లో 8న తిరుప్పూరు, కోయంబత్తూరు నగరాల్లో ప్రచారం చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఓ ప్రకటన జారీ చేసింది.

అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా

● సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం



ఓ చిన్నారిని ఆడిస్తున్న వినోజ్

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ చెన్నైలో అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని ఆ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం హామీనిచ్చారు. గురువారం సాయంత్రం విల్లివాక్కంలో ప్రచారం చేపట్టిన ఆయన ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో తమ ప్రభుత్వం రాగానే ఆయా సమస్యల్ని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెన్నై సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. వంతుల వారీగా రాష్ట్రాన్ని పాలిస్తున్న డీఎంకే, అన్నాడీఎంకేలు చేసిందేమీ లేదని, తమ స్వప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. గతంలో ఈ నియోజకవర్గంలో ఎంపీగా వ్యవహరించిన దయానిధి మారన్ ఏనాడూ ప్రజల్లోకి రాలేదన్నారు. తనకు గెలిపిస్తే నిత్యం అందుబాటులో ఉంటానని, ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. సెంట్రల్ చెన్నైలో నీటి కొరత సమస్యను చూస్తుంటే బాధేస్తోందని, తనను గెలిపిస్తే తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కిందిస్థాయి నుంచి వచ్చిన తనకు స్థానికుల సమస్యలు తెలుసని, అందుకే వచ్చే నెల 19న జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ చిహ్నామైన కమలం గుర్తుపై ఓటేసి, మోదీ ప్రభుత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. వరుసగా రెండుమార్లు కేంద్రంలో అధికారం చేపట్టిన మోదీ దేశాన్ని ప్రపంచపటంలో తలెత్తుకునేలా చేశారని, ప్రపంచ దేశాలన్నీ భారత్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇదిలా వుండగా ఓట్ల సేకరణ కోసం ప్రచారానికి వచ్చిన వినోద్‌కు స్థానికులు బ్రహ్మారథం పట్టారు.



● టంగ్ స్లిప్పయింది...



'హస్తం' గుర్తుకు ఓటెయ్యండి

● టీఎంసీ అభ్యర్థి ప్రచారంలో జీకే వాసన్

పెరంబూర్, మార్చి 28: ఎన్నికల ప్రచారంలో పెద్ద నేతలు కూడా ఒక్కోసారి నాలుక జారుతుంటారు. అలాంటి పరిస్థితి తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్‌కు ఎదురైంది. శ్రీపెరుంబుదూర్ లోక్‌సభ స్థానంలో బీజేపీ కూటమిలో టీఎంసీ అభ్యర్థిగా వేణుగోపాల్ పోటీ చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా జీకే వాసన్ బుధవారం టాపులేని జీపులో ప్రచారం చేపట్టారు. "ప్రజలారా మన పార్టీ అభ్యర్థి వేణుగోపాల్‌ను గెలిపించేలా 'హస్తం (కై)' చిహ్నానికి ఓటు వేయాలి' అంటూ ప్రసంగించారు. కొద్దిసేపటికి తన తప్పు తెలుసుకున్న ఆయన వెంటనే, జీపు కింద ఉన్న కార్యకర్తలను ఉద్దేశించి 'చేతులు దించండి... చేతులు దించండి' అంటూ మైక్‌లో మాట్లాడి, తన తప్పును కవర్ చేసుకుంటూ... 'సైకిల్' గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకసారైతే పర్వాలేదు.... మళ్లీ రిపీట్ అయితేనే కష్టం అంటూ ఆ పార్టీ కార్యకర్తలు గుసగుసలాడుకున్నారు.

● ఆస్తులే ఆస్తులు!

రాజా ఆస్తులు రూ. 21.61 కోట్లు

● మురుగన్ ఆస్తులు రూ. 2.37 కోట్లు



డీఎంకే అభ్యర్థి రాజా, బీజేపీ అభ్యర్థి ఎల్.మురుగన్

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నీలగిరి రిజర్వుడు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న డీఎంకే అభ్యర్థి ఎ.రాజా రూ.21.61 కోట్ల మేరకు చర, స్థిరాస్తులు కలిగి ఉన్నారు. ఈ మేరకు తన నామినేషన్‌లో అఫిడవిట్‌ను సమర్పించారు. ఆ వివరాల మేరకు రాజాకు రూ.3.73 కోట్ల మేరకు చరాస్తులున్నాయి. ఆయన కుమార్తె మయూరి పేరుతో రూ.2.88 కోట్ల చరాస్తులున్నాయి. రాజా వద్ద 108 సవర్ల బంగారు నగలు, 4,182 కేజీల వెండి నగలు, కుమార్తె వద్ద రూ.1,93 కోట్ల విలువైన నగలు రూ.12 లక్షల విలువ చేసే వజ్రాభరణాలున్నాయి. కుమార్తె మయూరి పేరిట తిరుచ్చి, పెరంబలూరులో రూ. 15.43 కోట్ల విలువైన 10.53 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూములు ఉన్నాయి. పెరంబలూరులో రూ.7.25లక్షల విలువైన పూర్వీకుల నివాసగృహం ఉంది. ఉమ్మడి కుటుంబం ద్వారా సంక్రమించిన ఆస్తులు రూ.9.79లక్షలని ఆయన పేర్కొన్నారు.

మురుగన్ ఆస్తులు రూ. 2.37 కోట్లు...

ఈ నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ రూ.2.37 కోట్ల విలువైన చర, స్థిరాస్తులు కలిగి ఉన్నారు. నామినేషన్‌తో జతపరచిన అఫిడవిట్ వివరాల ప్రకారం ఆయన రూ.1.01 కోట్ల చరాస్తులు, రూ.16లక్షల విలువైన స్థిరాస్తులు కలిగి ఉన్నారు. రూ.50 వేల నగదు, ఆయన భార్య కలైయరసి వద్ద రూ.72 వేల నగదు ఉన్నాయి. ఢిల్లీలోని కెనరా బ్యాంక్‌లో ఆయన పేరుపై రూ.61,694లు, అక్కడి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో రూ.22,44,829లు చొప్పున డిపాజిట్లు ఉన్నారు. భార్య కలైయరసి పేరుపై చెన్నై కీల్పాక్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో రూ.7,98,515 డిపాజిట్ చేసి ఉన్నారు. సైదాపేట ఇండియన్ బ్యాంక్‌లో రూ.11,516 నగదు పొదుపు చేశారు. ఎల్ఐసీ, ప్రైవేటు సంస్థలలో రూ.60లక్షల 38 వేలకు పైగా బీమా చేసి ఉన్నారు. భార్య కలైయరసి పేరుపై ఎల్ఐసీ, ప్రైవేటు సంస్థల్లో రూ.46 లక్షల 35 వేల చొప్పున బీమా చేసి ఉన్నారు. ఇక మురుగన్ వద్ద రూ.5లక్షల విలువైన కారు ఉంది. భార్య వద్ద రూ.40 వేల హోండా యాక్టివా స్కూటర్ ఉంది. మురుగన్ పేరుపై రూ.11లక్షల విలువైన 240 గ్రాముల బంగారు నగలు ఉన్నాయి. భార్య వద్ద రూ.33 లక్షల విలువైన 720 గ్రాములు బంగారు నగలు ఉన్నాయి. మురుగన్ ఢిల్లీలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.20లక్షల రుణం పొంది ఉన్నారు. ఆయన భార్య చెన్నై అన్నా నగర్ స్టేట్ బ్యాంక్ శాఖలో రూ.90లక్షల దాకా రుణం, మరో బ్యాంక్‌లో రూ.10లక్షల రుణం పొంది ఉన్నారు.

● వీఐపీ నియోజకవర్గం

సెంట్రల్ చెన్నైలో ఏ జెండా ఎగురుతుందో?



దయానిధి మారన్ (డీఎంకే) - వినోజ్ పి.సెల్వం (బీజేపీ) - పార్థసారథి (డీఎండీకే)



ప్యారీస్, మార్చి 28: రాష్ట్రంలో ఉన్న 39 లోక్‌సభ స్థానాల్లో సెంట్రల్ చెన్నైకు కూడా స్టార్ నియోజకవర్గం అన్న ప్రత్యేకత ఉంది. ఇందుకు కారణం, ప్రపంచంలో పొడవైన సముద్రతీరాల్లో మెరీనా ఒకటి. ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న దివంగత ముఖ్యమంత్రులు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి స్మారక మందిరాలు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. మెరీనాలో సేదతీరేందుకు పెద్దసంఖ్యలో స్వదేశీ, విదేశీ పర్యాటకులు వస్తుంటారు. హెరిటేజ్ కట్టడాలను కూడా ఈ నియోజకవర్గం సొంతం చేసుకుంది. మద్రాసు హార్బర్, మద్రాసు హైకోర్టు, సచివాలయ ప్రాంగణం, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం రిప్పన్ బిల్డింగ్, ద్రవిడ పితామహుడు పెరియార్ గ్రౌండ్, సెంట్రల్, ఎగ్మూర్ రైల్వేస్టేషన్లు, ఓమందూర్ రెడ్డి ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రాజీవ్‌గాంధీ జనరల్ ఆసుపత్రి, మరీ ముఖ్యంగా, క్రికెట్ అభిమానులను ఆనందంలో ముంచెత్తుతున్న చిదంబరం క్రికెట్ స్టేడియం ఈ స్థానంలోనే ఉండడం గమనార్హం.

డీఎంకే కంచుకోట...

లోక్‌సభ ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే, సెంట్రల్ చెన్నై నియోజకవర్గం డీఎంకే కంచుకోటగా ఉంటోంది. ఇప్పటివరకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే ఏడు సార్లు జెండా ఎగురవేసింది. రెండు సార్లు కాంగ్రెస్, జనతా పార్టీ, అన్నాడీఎంకే తలా ఒకసారి విజయం సాధించాయి. 1977 ఎన్నికల్లో జనతా పార్టీ అభ్యర్థి టి.రామచంద్రన్ ఎంపీగా గెలుపొందారు. 1980, 1984 సంవత్సరాల్లో డీఎంకే సీనియర్ నేత ఎ.కళానిధి, 1989, 1991 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అన్బరసును విజయం వరించింది. 1996, 1998, 1999 సంవత్సరాల్లో డీఎంకే అభ్యర్థిగా పోటీచేసిన మురసోలి మారన్ హ్యాట్రిక్ విజయం సాధించి రికార్డు నెలకొల్పారు. కాగా, 2004, 2009, 2019 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో మురసోలి మారన్ కుమారుడైన దయానిధి మారన్ ఎంపీగా గెలిచారు.

మొత్తం ఓటర్లు: ఎన్నికల కమిషన్ గత జనవరిలో విడుదల చేసిన తుది జాబితా ప్రకారం, ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 13,43,167 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 6,64,076 మంది, మహిళలు 6,78,658 మంది కాగా, ఇతరులు 433 మంది ఉన్నారు.

శాసనసభ నియోజకవర్గాలు...

ట్రిప్లికేన్ - చేపాక్కం, థౌజండ్ లైట్స్, అన్నానగర్, హార్బర్, విల్లివాక్కం, ఎగ్మూర్ (రిజర్వుడు) అనే ఆరు నియోజకవర్గాలున్న ఈ స్థానంలో ఇప్పుడున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా డీఎంకేకు చెందిన వారు కావడం గమనార్హం.

2019 ఎన్నికల ఫలితాలు...

డీఎంకే తరఫున పోటీ చేసిన దయానిధి మారన్ 4,47,150 ఓట్లు రాబట్టుకొని ఎంపీగా గెలిచారు. ప్రస్తుతం 5వ సారి ఇండియా కూటమి తరఫున ఉదయించే సూర్యుడు గుర్తుపై పోటీ చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఓటమి చవిచూసిన ఆయన పీఎంకే అభ్యర్థి శ్యాంపాల్ 1,46,813 ఓట్లు, మక్కల్ నీది మయ్యం అభ్యర్థి కమిల నాజర్ 92,047 ఓట్లు, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి డాక్టర్ కార్తికేయన్ 30,809 ఓట్లు, ఎస్డీపీఐ అధ్యక్షుడు తెహల్‌హాన్ భాగవి 23,690 ఓట్లు పొందారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి తరఫున పీఎంకే పోటీ చేసింది.

చతుర్ముఖ పోటీ...

సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో చతుర్ముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్ కూటమిలోని డీఎంకే తరఫున సిట్టింగ్ ఎంపీ దయానిధి మారన్, బీజేపీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోజ్ పి.సెల్వం, అన్నాడీఎంకే కూటమి తరఫున డీఎండీకే ఉప ప్రధాన కార్యదర్శి పార్థసారథి, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా డాక్టర్ కార్తికేయన్ పోటీ చేస్తున్నారు.

ప్రధాన సమస్యలు...

మిగతా లోక్‌సభ నియోజకవర్గాల కంటే అత్యంత ప్రాముఖ్యం సంతరించుకున్న ఈ నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు కొలువుదీరాయి. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో భారీ వర్షాల కారణంగా అష్టకష్టాల పాలవుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఈ నియోజకవర్గ ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నా ఫలితం మాత్రం అంతంత మాత్రమే. మరోవైపు వాహనాల రాకపోకల కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదు. ప్యారీస్, ఫ్లవర్ బజార్, కొత్వాల్ మార్కెట్, మన్నడి, ముత్యాలపేట ప్రాంతాల్లో ఒక్క ఆదివారం మినహాయించి మిగతా రోజుల్లో జనసంచారం అధికంగా ఉండడం వల్ల ద్విచక్రవాహనాల్లో వెళ్లేందుకు కూడా దారి ఉండదు.

అభివృద్ధికి ఓటేయ్యండి

ఈ నియోజకవర్గంలో ఐదో సారి కాంగ్రెస్ కూటమి నుంచి డీఎంకే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం దక్కింది. నాలుగు సార్లు ఎంపీగా నేను చేసిన అభివృద్ధి పనులతో పాటు ఈ ఐదేళ్లలో నా పనితీరు గుర్తించుకొని మళ్లీ ఎంపీగా గెలిపించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. డీఎంకే తరఫున, అదే విధంగా హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు నిర్వహించే అభివృద్ధి, సంక్షేమ సహాయాల పంపిణీల్లో నేను తప్పకుండా పాల్గొంటున్నా. పార్లమెంటు సమావేశాల్లో ఈ నియోజకవర్గంలో తిష్ట వేసిన సమస్యల గురించి ప్రస్తావిస్తున్నా. ఎగ్మూర్ రైల్వేస్టేషన్ విస్తరణ పనులు రూ.734.91 కోట్లతో జరుగుతున్నాయి. నేను గెలిస్తే నియోజకవర్గంలో మరిన్ని పథకాలను ప్రవేశపెడతా.

- సిట్టింగ్ ఎంపీ దయానిధి మారన్

● సీఎం గారొస్తున్నారోచ్!

స్టాలిన్ వాకింగ్ కోసం

● మదురై పార్కులో జోరుగా మరమ్మతులు



చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారం కోసం మదురైకి వెళుతున్న డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వాకింగ్ కోసం అక్కడి పార్కులో శరవేగంగా మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ నెల 22న లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన స్టాలిన్ ఈ నెల 9న మదురై, శివగంగ అభ్యర్థులకు మద్దతుగా మదురైలో ప్రచారం చేయనున్నారు. ఆ రోజు రాత్రి ఆయన మదురైలో బస చేయనున్నారు. మరుసటి రోజు తేని, దిండుగల్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడానికి తేనికి బయలుదేరి వెళ్లనున్నారు. ఆ సందర్భంగా 10వ తేది ఉదయం స్టాలిన్ మదురై కార్పొరేషన్ కార్యాలయానికి చేరువగా ఉన్న పార్కులో వాకింగ్ చేయనున్నట్లు డీఎంకే స్థానిక శాఖ నాయకులు కార్పొరేషన్ అధికారులకు తెలిపారు. దీంతో చెత్తాచెదారం ముళ్ల పొదలతో నిండి ఉన్న ఆ పార్కును కార్పొరేషన్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. ఏప్రిల్ 9వ తేదీలోగా ఆ పార్కు కొత్త సొబగులు సంతరించుకుంటుందని అధికారులు తెలిపారు.



చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని తన పెద్ద కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ప్రముఖ సినీ దర్శకుడు శంకర్

తుది దశకు సోనా 'స్మోక్' వెబ్ సిరీస్

చిత్రజ్యోతి



సోనా హైదర్

దక్షిణ భారత చలన చిత్రపరిశ్రమలో గుర్తింపు పొందిన నటీమణుల్లో సోనా హైదర్ ఒకరు. ఆమె జీవిత చరిత్ర ఆధారంగా 'స్మోక్' పేరుతో ఓ వెబ్ సిరీస్ తెరకెక్కుతోంది. ఇందులో సోనా ప్రధాన పాత్రను పోషించడమేకాకుండా, ఆమె స్వయంగా దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. ఇందులో సోనాకు చెందిన విభిన్న వయస్సుల్లోని పాత్రలను ఆదిని (5 యేళ్లు), జనని (14 యేళ్లు), ఆస్తా అభయ్ (30 యేళ్ల)లు పోషిస్తున్నారు. ఈ పాత్రలకు సంబంధించిన పోస్టర్లను ఇటీవల మేకర్స్ రిలీజ్ చేయగా, వాటికి మంచి స్పందన వచ్చింది. ఈ వెబ్ సిరీస్ గురించి సోనా మాట్లాడుతూ... 'స్మోక్ నా జీవిత కలలకు చెందిన సిరీస్. నా జీవిత చరిత్రను చెప్పడం, అడిగిన ప్రశ్నలు లేదా మరిచిపోయిన ప్రశ్నలు, నిగూఢమైన ప్రశ్నలు, బహిర్గతం కాని అనేక అంశాలను ఇందులో ప్రస్తావించా. ఓసారి నా జీవితంలోకి వచ్చి చూడండి' అని అంటున్నారు. యూనిక్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ వెబ్ సిరీస్.. రానున్న వేసవిలో షార్ట్‌ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

'దేశింగు రాజా-2'లో ముంబై బ్యూటీ స్పెషల్ సాంగ్

● రూ.50 లక్షలతో బంగళా సెట్



స్నేహా గుప్తా

ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిలిమ్స్ పరిచయం చేసిన దర్శకుల్లో ఎళిల్ ఒకరు. ఈయన చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి పాతిక సంవత్సరాలు అయింది. అలాగే, తన 25వ చిత్రంగా 'దేశింగు రాజా-2'ను తెరకెక్కిస్తున్నారు. గతంలో వచ్చిన 'దేశింగు రాజా'కు ఇది సీక్వెల్. ఇన్ఫినిటీ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత పి.రవిచంద్రన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో విమల్, పూజిత పొన్నాడ జంటగా నటించగా, రెండో హీరోయిన్‌గా హర్షిత, మరో కీలక పాత్రలో జనా నటిస్తున్నారు. వీరితో పాటు రవిమరియా, రోబో శంకర్, మొట్టై రాజేంద్రన్, లొల్లు సభ స్వామినాథన్, సింగంపులి, శామ్స్, వయ్యాపురి, మదురై ముత్తు, మధుమిత తదితరులు ఇతర పాత్రలను పోషిస్తున్నారు. సుదీర్ఘకాలం తర్వాత ప్రముఖ సంగీత దర్శకుడు విద్యాసాగర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తి చేసుకోగా, రెండో షెడ్యూల్‌ను చిత్రీకరిస్తున్నారు. ఇందులోని ఓ ప్రత్యేక గీతం కోసం ఈసీఆర్‌లో రూ.50 లక్షలతో ప్రత్యేకంగా బంగళా సెట్‌ను నిర్మించారు. ఇందులో ముంబై డ్యాన్సర్ స్నేహా గుప్తా, హీరో విమల్‌పై నృత్యదర్శకుడు దినేష్ మాస్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక గీతాన్ని చిత్రీకరిస్తున్నారు. పోలీస్ అధికారి అయిన హీరో.. నిరంతరం తీవ్రమైన ఒత్తిడితో నలిగిపోతుంటారు. దీన్నుంచి ఉపశమనం పొందేందుకు ఈ క్లబ్‌కు వెళ్లగా, అక్కడ ముంబై డ్యాన్సర్‌తో కలిసి కాలు కదుపుతారని దర్శకుడు ఎళిల్ వివరించారు. పూర్తి హాస్యభరిత చిత్రంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీని సమ్మర్ స్పెషల్‌గా విడుదల చేయడానికి సన్నాహాలు చేపడుతున్నారు.

స్కూల్‌కు మరుగుదొడ్డిని నిర్మించిన కేపీవై బాల



రాఘవ లారెన్స్‌తో కేపీవై బాల

నిరంతరం సమాజ సేవలో నిమగ్నమయ్యే ప్రముఖ యాంకర్, హాస్య నటుడు కేపీవై బాలా తాజాగా పాఠశాల విద్యార్థులకు సాయం చేశారు. సినీ హీరో, దర్శకుడు, నిర్మాత రాఘవ లారెన్స్‌తో కలిసి ఈ సాయం అందజేశారు. తిరువణ్ణామలై జిల్లా ఇరుంబేడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రూ.15 లక్షలతో మరుగుదొడ్డిని నిర్మించారు. దీన్ని రాఘవ లారెన్స్‌తో కలిసి ప్రారంభించారు. ఈ టాయిలెట్ నిర్మాణం కోసం రాఘవ లారెన్స్ కూడా ఆర్థిక సాయం చేశారు. ఈ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు ఆయన సాయం చేశారు. అంతే కాకుండా, నిరంతరం సమాజ సేవ చేస్తున్న కేపీవై బాలాను లారెన్స్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. బాలా కూడా తాను సంపాదించే డబ్బులో కేవలం తన ఖర్చులకు మాత్రమే ఉంచుకుని మిగిలిన సొమ్మును సేవా కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తున్నారు. ఇటీవల తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి టౌన్, అలంగాయం యూనియన్, నెక్కమలై అనే కొండ ప్రాంతానికి కూడా ఆయన అంబులెన్స్ కొనిచ్చి అందరి ప్రశంసలు అందుకున్న విషయం తెల్సిందే.